క్లుప్తంగా

'యువత పోరు' వాయిదా

రామచంద్రపురం: జిల్లా కలెక్టరేట్‌ల వద్ద శుక్రవారం జరగాల్సిన వైఎస్సార్ సీపీ యువత పోరు కార్యక్రమం వాయిదా పడినట్లు జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు, నియోకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ తెలిపారు. స్థానిక గాంధీపేటలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ నిరుద్యోగ భృతి, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉందన్నారు. కానీ అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదం కారణంగా వాయిదా వేసినట్లు తెలిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని సూర్యప్రకాశ్ వెల్లడించారు.

నేడు కౌన్సిల్ సమావేశం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు కమిషనర్ టీవీ రంగారావు గురువారం తెలిపారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో 16 అంశాలతో కూడిన అజెండాపై చర్చిస్తామన్నారు.

రక్తదానం శిబిరం

రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండపేట ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకుమారి గురువారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకూ ఆస్పత్రిలో రక్త సేకరణ ప్రక్రియ కొనసాగిస్తామన్నారు. సరైన సమయంలో రక్తం లభ్యం కాక గర్భిణులు, చిన్నారులు, ప్రమాద బాధితులు ఇబ్బంది పడుతున్నారని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఆసక్తి ఉన్నవారు కురసాల సత్యనారాయణ ఫోన్ నంబర్ 98494 70020, ఆస్పత్రి సిబ్బంది, వార్డుల్లో వైద్య ఆరోగ్య కార్యకర్తలను కానీ సంప్రదించవచ్చని రాధాకుమారి తెలిపారు.

పలువురికి పరామర్శ

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట 20వ వార్డులోని డాక్టర్ వైఎస్సార్ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మోర్త శ్యామ్ ఆరోగ్య సమస్యతో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. అదే కాలనీకి చెందిన మరో కార్యకర్త బత్తిన దొరబాబు కుమార్తె ఇటీవల ప్రమాదానికి గురై ఇంటి వద్ద కోలుకుంటున్నారు. వారిద్దరినీ మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, పార్టీ నాయకుడు యరమాటి వెంకన్నబాబు, పేరూరి మాధవి, పి.కృపావతి, కొమ్మోజు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కపిలేశ్వరపురం (మండపేట): మండపేటలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి శంకుస్థాపన చేశారు. 15 నుంచి 22వ వార్డుల పరిధిలో రూ.1.54 కోట్ల బీపీఎస్ నిధులతో 16 సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించనున్నారు. మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ చుండ్రు శ్రీవరప్రకాష్, వైస్ చైర్‌పర్సన్ పిల్లి గణేశ్వరరావు, కౌన్సిలర్లు మందపల్లి రవికుమార్, డిప్యూటీ ఏఈ కె.శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజినీర్ డీవీ పవన్ పాల్గొన్నారు.

- మండపేటలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై విజయోత్సవం పేరుతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే జోగేశ్వరరావు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

శివారు గ్రామాల అభివృద్ధికి కృషి

కాజులూరు: నియోజకవర్గంలో శివారు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. దుగ్గుదుర్రు శివారు పాలమూరుపాడులో పైప్‌లైన్ నిర్మాణాన్ని ప్రారంభించి మహిళలకు బిందెలతో తాగునీరు పంపిణీ చేశారు. నియోజకవర్గ బీజేపీ కోఆర్డినేటర్ దూడల శంకరనారాయణ, సర్పంచ్ పోతుల వెంకటలక్ష్మి, జ్యోతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం ఏసీగా ప్రసాద్

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం నూతన అసిస్టెంట్ కమిషనర్‌గా ఎంకేటీఎస్‌వీ ప్రసాద్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. తొలుత స్వామికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవస్థానం కార్యాలయంలో అర్చకుల వేదమంత్రాల మధ్య బాధ్యతలు తీసుకున్నారు.

ఈ-శ్రమ్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి

ఆలమూరు: భవన నిర్మాణ కార్మికుల జీవనోపాధితో పాటు ఆపద సమయంలో ఆదుకునే ఈ-శ్రమ్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎ.రాజు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇటీవల నూతనంగా ఎంపికైన స్వయంకృషి పెయింటర్స్ అండ్‌వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గుర్తింపు ధ్రువపత్రాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-శ్రమ్ కార్డును తీసుకోవడం ద్వారా ప్రభుత్వం నుంచి కార్మికులు అనేక రాయితీలు పొందవచ్చన్నారు. అలాగే పోస్టాఫీస్‌లో రూ.750 చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. భవన నిర్మాణ కార్మికుల సౌలభ్యం, సౌకర్యం కోసం తమ వంతు సహకారం అందిస్తామని ఎంపీడీఓ రాజు తెలిపారు.

పొలం బాట పట్టినారు

- యాజమాన్య పద్ధతులతో మంచి నారు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న అధికారులు
- తద్వారా అధిక దిగుబడులు


కె.గంవరం మండలంలో నారుమడి

కె.గంగవరం: పల్లెల్లో సార్వా సందడి నెలకొంది. పచ్చని సిరులు పండించే తొలకరి సాగు ప్రారంభమైంది.. రైతులంతా పొలాలను దమ్ము చేసుకుని నారుమడులు వేసే పనిలో ఉన్నారు. ఈ నారుమడి వేసుకునే సమయంలో చేసే తప్పులతో దిగుబడిపై ప్రభావం చూపుతుందని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు. ఆరోగ్యకరమైన నారుమడితో అద్భుతాలు సాధించవచ్చని చెబుతున్నారు. ముఖ్యంగా యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి నారు లభిస్తుందని, దాని ద్వారా మంచి దిగుబడులు వస్తాయని వివరిస్తున్నారు.

నారుమడి తయారీ ఇలా..

- నారుమడిలో రెండు క్వింటాళ్ల పశువుల ఎరువు లేదా వర్మికం పోస్టు వేసి రెండు, మూడుసార్లు బాగా దమ్ము చేసి చదును చేయాలి.
- దమ్ము చేసిన భాగంలో కొంత మేర నారుమడి కోసం కేటాయించి నీరు, పోషకాలు బయటకు పోకుండా కట్టుదిట్టంగా గట్టు వేయాలి.
- ఐదు సెంట్ల నారుమడికి కేజీ నత్రజని, కేజీ భాస్వరం, కేజీ పొటాష్ వేసుకోవాలి.
- వరి చేను కంటే నారుమడి కొంత మేర ఎత్తుగా ఉంటేనే మంచిది.
- విత్తనాలు చల్లేందుకు సుమారు 10 నుంచి 12 రోజుల ముందే నారుమడి దమ్ము చేసుకుని ఉండాలి.
- సులభంగా నీరు పెట్టేందుకు, బయటకు పంపేందుకు వీలుగా ఉన్న ప్రాంతంలోనే నారుమడి తయారు చేసుకోవాలి.
- సెంటు నారుమడికి సుమారు ఐదు కిలోల చొప్పున విత్తనాలు చల్లుకోవాలి.
- నారుమడి మొలకలు వచ్చే వరకూ ఆరుతడులు ఇచ్చి తరువాత పల్చగా నీరు నిల్వకట్టాలి.
- విత్తనాలు వేసిన అనంతరం 15 రోజుల తరువాత కేజీ నత్రజని వేసుకోవాలి.
- నాట్లు వేయడం ఆలస్యమైతే మరోసారి నత్రజని వేసుకుంటే నారు ముదిరిపోకుండా ఉంటుంది. మొక్కదశలో నారుమడిలో నీరు పల్చగా ఉండేలా చూసుకోవాలి.

రక్షణ చర్యలు ఇలా..

నారుమడిలో నారు తీయడానికి 19 రోజుల ముందు కార్బోఫ్యూరాన్ గుళికలు 400 గ్రాములు చల్లుకోవాలి. నారు కొనభాగాలను తుంచి వేసి నాట్లు వేస్తే కాండం తొలిచే పురుగును నివారించవచ్చు. నారును 0.02 శాతం క్లోరోపైరీఫాస్ ద్రావణంలో నాలుగు గంటలు ముంచి నాట్లు వేసుకుంటే కాండం తొలిచే పురుగు, ఆకుముడత దోమను నివారించవచ్చు. నారు బాగా ముదిరి ఆలస్యంగా నాట్లు వేస్తే కుదురుకు 6 నుంచి 8 మొక్కలు నాటుకుంటే మంచిది. పోషక యాజమాన్యం, సస్యరక్షణ ద్వారా నారును పెంచితే ప్రధాన పంట పొలంలో వచ్చే సమస్యల నుంచి కాపాడుకోవచ్చు.

విత్తన శుద్ధి అవసరం



నారు ఆరోగ్యంగా, దిగుబడులు అధికంగా రావాలంటే ప్రతి రైతూ తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసి తీరాలి. దీనిలో భాగంగా కిలో విత్తనానికి 2.5 లేదా 3 గ్రాముల కార్బండిజమ్ కలిపి ఆరబెట్టి విత్తనశుద్ధి చేసుకోవాలి. తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. విత్తనశుద్ధి చేయడం ద్వారా నారుమడిలో గానీ ప్రధాన పొలంలో గానీ చాలావరకూ పంటలకు సోకే తెగుళ్ల నుంచి నివారించుకోవచ్చు.

-బి.రవి, ఏఓ, కె.గంగవరం

రేషన్ సరకుల కోసం అవస్థలు

కపిలేశ్వరపురం: ఇంటింటికీ రేషన్ సరకుల పంపిణీ పథకాన్ని రద్దు చేసి, రేషన్ షాపునకు వెళ్లి సరకులు తెచ్చుకోమనడంతో లబ్ధిదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యులు పలివెల మధు, పెందుర్తి శిరీష, రుద్రాక్షుల గౌరీకుమారి అన్నారు. వృద్ధులు, వికలాంగులతో సహా దూరపు ప్రాంతాల వారి అవస్థలను చూసి అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ రేషన్ సరకుల పంపిణీ పథకాన్ని అమలు చేశారన్నారు. సామాన్యులకు ఉపకరించే పథకాలను రద్దు చేసే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.

రేపు విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేటలోని శ్రీరమా హిందూ మున్సిపల్ స్కూల్‌లో శనివారం విశ్రాంత ఉద్యోగుల సంఘ పట్టణ శాఖ సమావేశం నిర్వహించనున్నట్టు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు దేవళ్ల సత్యనారాయణ, కార్యదర్శి పెంకే గోవిందరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో పట్టణ, మండలంలోని గ్రామాల్లోని రిటైర్డ్ పెన్షనర్లు హాజరవుతారన్నారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన


మండపేటలో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కపిలేశ్వరపురం (మండపేట): తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ 20 రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులు గురువారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిలబడి తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా తమ జీతాలను పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి చట్ట పరిధిలోని ప్రయోజనాలన్నీ అమలు చేయాలని నాయకులు కప్పల అన్నవరం, పిట్టా ప్రవీణ్ కుమార్, సైనం భాస్కరరావు, మండపాటి గన్నియ్య, వెంకటేశ్వర్లు, తలాటి వెంకన్న, వాసంశెట్టి వాసు, వాసంశెట్టి బాలరాజు అన్నారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ


మండపేటలో విద్యార్థి మిత్ర కిట్లు అందజేస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట ఎస్ఎస్‌వీపీ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి చేతులమీదుగా పంపిణీ చేశారు. నూతన విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు, బ్యాగులు అందజేశారు. కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, పాఠశాల ఎస్ఎంఎస్‌సీ చైర్మన్ ఇల్లూరి కామేశ్వరరావు, ఉన్నత పాఠశాల హెచ్ఎం ఏకేపీ వాణి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కె.సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు యరమాటి వెంకన్నబాబు, కార్యకర్తలు పేరూరి మాధవి, పీ.కృపావతి, కొమ్మోజు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

రాయవరం: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీ అన్నారు. స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పీఎంశ్రీ నిధులతో నిర్మించిన లైబ్రరీని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య, రాత పుస్తకాలను అందజేశారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వుండవిల్లి రాంబాబు, ఎస్ఎంసీ చైర్మన్ దేవిశెట్టి చిన్ని పాల్గొన్నారు.

సబ్ ట్రెజరీ అధికారిగా సుజాత



ఆలమూరు: స్థానిక సబ్ ట్రెజరీ అధికారి (ఎస్‌టీఓ)గా వి.సుజాత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఆమె రాజమహేంద్రవరం ఎస్‌టీఓగా పనిచేస్తూ బదిలీపై ఆలమూరు ఎస్‌టీఓ కార్యాలయానికి వచ్చారు. స్థానిక ఎస్‌టీఓగా ఇప్పటి వరకూ పనిచేసిన హైదర్ అలీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతూరుకు బదిలీపై వెళ్లారు. తమ శాఖ పరిధి మేరకు విధులు సక్రమంగా నిర్వహిస్తూ ప్రజలకు పరిపూర్ణమైన సేవలు అందిస్తానని సుజాత తెలిపారు. అలాగే దీర్ఘకాలిక సమస్యలు ఉన్నట్లయితే జిల్లా ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

మోగిన బడిగంట

తొలి రోజు హాజరు అంతంతే


పసలపూడిలో పాఠశాలను సందర్శించిన డీవైఈఓ రామలక్ష్మణమూర్తి

రాయవరం: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం పునః ప్రారంభమయ్యాయి. 2024–25 నూతన విద్యా సంవత్సరం గురువారం ఉదయం 9 గంటలకు బడిగంటతో ప్రారంభమైంది. బంగారు భవితకు బాట వేసుకోవాల్సిన విద్యార్థులు వడివడిగా బడికి చేరుకున్నారు. పాఠశాలల పునః ప్రారంభమైన తొలి రోజు జ్యేష్ఠ బహుళ పక్షం పాడ్యమి అయినప్పటికీ వేసవి సెలవుల అనంతరం విద్యార్థుల హాజరు పాఠశాలల్లో అంతంత మాత్రంగానే ఉంది. రామచంద్రపురం డీవైఈవో కార్యాలయ పరిధిలోని ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలలు పూర్తి స్థాయిలో ప్రారంభమయ్యాయని డీవైఈఓ పి.రామలక్ష్మణమూర్తి తెలిపారు.

పూర్తిగా అందని కిట్లు

విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు పూర్తి స్థాయిలో అందలేదు. విద్యార్థి కిట్‌లో భాగంగా పాఠ్య పుస్తకాలు, వర్క్, నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగ్, యూనిఫామ్, బెల్టులు, షూ, రెండు జతల సాక్సులు, స్కూల్ బ్యాగ్ అందజేయాలి. అయితే పాఠశాలల ప్రారంభం రోజు కేవలం పాఠ్య పుస్తకాలు, వర్క్, నోట్‌బుక్స్ మాత్రమే ఇచ్చారు. తొలి రోజు మండలంలో పలు పాఠశాలలను డీవైఈఓ పి.రామలక్ష్మణమూర్తి సందర్శించి, విద్యార్థుల హాజరును పరిశీలించారు.

హాజరు పెంచేలా చర్యలు తీసుకోండి


కె.గంగవరం పాఠశాలలో అసంపూర్తి భవనాన్ని పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ మమ్మీ

కె.గంగవరం: విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెంచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీ అన్నారు. కె.గంగవరం ఉన్నత పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. తొలుత పాఠశాల ప్రాంగణంలో అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పరిశీలించి నాబార్డు నిధుల ద్వారా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. పాఠశాలలో చేపడుతున్న క్రాఫ్ట్ ప్రదర్శనను సందర్శించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల వాతావరణం విద్యార్థుల మనోవికాసానికి అనువుగా ఉండాలన్నారు. మెరుగైన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని వారికి అందించాలని అన్నారు. పాఠశాలలో సామాజిక శాస్త్ర ఉపాధ్యాయుల కొరత ఉందని తెలుసుకుని, వెంటనే భర్తీ చేస్తామని తెలిపారు. త్వరలో పాఠశాలలో ఒకేషనల్ కోర్సులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆరో తరగతిలో కొత్తగా చేరిన విద్యార్థులకు ఆమె పాఠ్య పుస్తకాలను అందించారు. జీసీడీఓ ఏఎంకే భీమారావు, జిల్లా సైన్స్ ఆఫీసర్ జీవీఎస్ సుబ్రహ్మణ్యం, హెచ్ఎం వెంకటేశ్వరరావు, ఏంఈఓలు ఎ.నాగరాజు, ఆంజనేయులు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పీవీఎస్ఎస్ మూర్తి, మాగాపు ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై అఘాయిత్యాలను ప్రశ్నించడం తప్పా?

- ఎమ్మెల్యే వేగుళ్లకు చైర్‌పర్సన్ దుర్గారాణి ప్రశ్న
- జగన్‌పై అక్కసుతో దిశ యాప్‌ను రద్దు చేశారు


మండపేటలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): కూటమి ఏడాది పాలనలో మహిళలు, చిన్నారులపై జరిగిన అఘాయిత్యాలను తాను తప్పుపట్టిన నేపథ్యంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు స్పందించిన తీరు హాస్యాస్పదంగా ఉందని మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై అఘాయిత్యాలను నిరసిస్తూ ఇటీవల అమలాపురంలో జిల్లావ్యాప్త నిరసన కార్యక్రమాన్ని నిర్వహించామని, ఆ సందర్భంగా అఘాయిత్యాలను ఆపడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని తాను విమర్శించానన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అఘాయిత్యాలు జరగలేదా అని, కూటమి ప్రభుత్వ హయాంలో ఎన్ని జరిగాయో లెక్క చెప్పగలరా అంటూ తనను ఎమ్మెల్యే ప్రశ్నించడం సరికాదన్నారు. ఈ నేపథ్యంలో మండపేట పట్టణంలోని తన కార్యాలయంలో కౌన్సిలర్లు ఎర్నేన ప్రభావతి, నాయుడు లక్ష్మీసౌజన్య, నీలం దుర్గ, మొండి భవాని, మందపల్లి రవికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు యరమాటి వెంకన్నబాబు, శెట్టి నాగేశ్వరరావులతో కలసి విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా సమస్యలను లేవనెత్తినప్పుడు అధికారంలో ఉన్న కూటమి నాయకులు సమస్యను పరిష్కరించే దిశగా స్పందిస్తారని ఆశించానన్నారు. దానికి భిన్నంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడడం ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు. ఆయన అడిగిన నేపథ్యంలో ఒక్కరోజు వ్యవధిలోనే తాను వివరాలను సేకరించగా కూటమి ప్రభుత్వంలో 185 మందిపై అఘాయిత్యాలు జరగడంతో పాటు 14 మందిని చంపేశారన్నారు. వీటితో పాటు మరెన్నో ఘటనలు ఉన్నాయన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు మహిళలకు రక్షణ ఇస్తామంటూ చెప్పిన ఉపన్యాసాలన్నీ వట్టిమాటలయ్యాయన్నారు. ఆడపిల్ల ఒంటిపై చేయిపడితే భయపడేలా కూటమి పాలన ఉంటుందంటూ పవన్ కల్యాణ్ అన్నారని, అధికారంలోకి వచ్చాక ఆయన స్పందన ప్రశ్నార్థకంగా మారిందన్నారు. మహిళల సమస్యలను రాజకీయం చేయకుండా పరిష్కరించే దిశగా ఆలోచన చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో దిశ యాప్ ద్వారా మహిళా సమస్యలపై నిమిషాల్లో స్పందించిన ఘనత తమ నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్ జగన్ పథకాలను రద్దు చేయడమే పనిగా పెట్టుకున్న కూటమి ప్రభుత్వం దిశ యాప్‌ను సైతం మూలకు నెట్టిందన్నారు. వైఎస్ జగన్ రాజకీయంగా కల్పించిన రిజర్వేషన్ల వల్లనే తాను మున్సిపల్ చైర్‌పర్సన్ సీట్‌లో కూర్చోగలిగానన్నారు. తనలాంటి మహిళలెందరో రాజకీయ రంగంలో రాణిస్తున్నారన్నారు. కూటమి పాలనలో మహిళలపై అఘాయిత్య ఘటనలపై పోలీసులు సకాలంలో స్పందించకపోవడం విచారకరమన్నారు.

సామూహిక అక్షరాభ్యాసాలు


సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో మంత్రి సుభాష్ తదితరులు

రామచంద్రపురం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం సామూహిక అక్షరాభ్యాసాలు, మండలంలోని 105 అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందించిన ఇండక్షన్ కుక్కర్లు, ప్రెజర్ కుక్కర్ల పంపిణీ కార్యక్రమం మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా నిర్వహించారు. ఎంపీపీ అంబటి భవాని, ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి, సీడీపీఓ వీవీ వరాహలక్ష్మి, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వడ్లమూరులో..

కపిలేశ్వరపురం: వడ్లమూరు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఐసీడీఎస్ మండపేట సీడీపీఓ అధికారి గజలక్ష్మి పర్యవేక్షణలో సూపర్‌వైజర్ ఐ.మాణిక్యం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శ్రమ స్వచ్ఛంద సంస్థ సభ్యులు దుర్గారావు, రమణయ్య, భవాని తదితరులు పాల్గొన్నారు.

పొగ... ప్రయాణికులకు సెగ


మొగలిపాలెం రహదారిలో చెత్త నుంచి వస్తున్న పొగ

కాజులూరు: రోడ్డు పక్కన చెత్తకుప్పలకు నిప్పెట్టడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. కాజులూరు మండల గ్రామాల్లో ప్రస్తుతం సార్వా దమ్ములకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా పొలాల్లో ఉన్న చెత్తాచెదారం, కలుపు మొక్కల అవశేషాలను కొందరు రైతులు రోడ్డుపైకి తెచ్చి పోగుచేసి నిప్పంటిస్తున్నారు. దీంతో దట్టమైన పొగ కమ్ముకుని రోడ్డు అంతా అలముకుంటుంది. ఫలితంగా రహదారిపై ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. కళ్లలోకి పొగ వెళ్లి విపరీతమైన మంట వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

సురుచి ఫుడ్స్‌కు 5 స్టార్ రేటింగ్


తాపేశ్వరంలో రేటింగ్ సర్టిఫికెట్‌ను అందుకుంటున్న మల్లిబాబు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం తాపేశ్వరంలోని సురుచి ఫుడ్స్ సంస్థకు హైమ్ సర్టిఫికేషన్స్ అనే అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ 5 స్టార్ నాణ్యతా రేటింగ్‌ను ప్రకటించింది. ఆ మేరకు సంస్థ ఏపీ మేనేజింగ్ డైరెక్టర్ శివయ్య రేటింగ్‌ను సూచించే సర్టిఫికెట్‌ను గురువారం తాపేశ్వరంలో సురుచి ఫుడ్స్ అధినేత మల్లిబాబుకు అందజేశారు. స్వీట్స్ తయారీ, ప్యాకింగ్‌లలో పరిశుభ్రతా ప్రమాణాలను పాటించడం, సిబ్బంది రక్షణకు తగిన చర్యలు చేపట్టడం, వినియోగదారుల సంతృప్తి స్థాయిలను ప్రామాణికంగా తీసుకుని రేటింగ్‌ను నిర్దేశించామని శివయ్య తెలిపారు.

ఎయిర్ కూలర్ల బహూకరణ


కూలర్లకు పూజలు చేసి ప్రారంభిస్తున్న ఈఓ దుర్గాభవాని, దాత కుటుంబ సభ్యులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన అనుమోలు దేవా, కుటుంబ సభ్యులు రూ. లక్ష విలువైన 8 ఎయిర్ కూలర్లు అందజేశారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని దాతలతో కలసి పూజలు నిర్వహించి కూలర్లు ప్రారంభించారు. అనంతరం దాతల కుటుంబానికి స్వామివారి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలను అందజేశారు. దాతను కూలర్లు అందజేసేలా ప్రోత్సహించిన ఆలయ చండీ హోమ పండితుడు జుత్తిక చిన్నాను అభినందించారు.

బ్రోచర్ ఆవిష్కరణ

రామచంద్రపురం: పశుసంవర్ధక శాఖ వార్షిక ప్రగతి బ్రోచర్‌ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం ఆవిష్కరించారు. స్థానికంగా ఈ కార్యక్రమం పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ కె.వెంకటరావు, అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ సమక్షంలో జరిగింది. కూటమి ప్రభుత్వం గత ఏడాదిలో పశు సంవర్ధక శాఖకు రూ.3,576 కోట్లు వెచ్చించిందని మంత్రి తెలిపారు. నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

- ఏడాది కూటమి పాలనలో నియోజవర్గంలో రూ.125 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని రామచంద్రపురంలో విజయోత్సవం నిర్వహించారు.

కేజ్ కల్చర్ యూనిట్‌తో ఉపయోగాలు

మామిడికుదురు: కేజ్ కల్చర్ యూనిట్‌తో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని నాబార్డు డీడీఎం సోమునాయుడు తెలిపారు. పెదపట్నం గ్రామంలోని గోదావరి ప్రాంతంలో సాగు చేస్తున్న కేజ్ కల్చర్ యూనిట్‌ను ఆయన గురువారం పరిశీలించారు. గోదావరి ఫిష్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ (ఎఫ్‌పీఓ) రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుందని, దీని ఆధారంగా కేజ్ కల్చర్ మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే ఎఫ్‌పీఓ మెంబర్ షిప్ కూడా ప్రారంభమైందని చెప్పారు. ఈ సమోదు వల్ల భవిష్యత్తులో జరిగే నాబార్డ్ కార్యక్రమాల్లో మరియు ఫిష్ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు అయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. కేజ్ కల్చర్ నిర్వాహకుడు లక్ష్మీనారాయణ, ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ కొల్లు శివరాజ్, సభ్యులు పాల్గొన్నారు.